సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.28
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.28 కనిష్టంగా రూ.16, సరాసరిన రూ.21 ప్రకారం ధర పలికాయి.



నిఘా నేత్రం.. ఇల్లు భద్రం
చోరీల నియంత్రణకు పోలీసుశాఖ తీసుకు వచ్చిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ సత్ఫలితాలిస్తోంది. ఊళ్లకు వెళ్లేవారు యాప్‌ను వినియోగించుకుంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
30.7°/21.1°
జిల్లా పరిధిలో ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగుతోంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

12న కరువు పరిశీలన బృందం రాక!

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో కరువు పరిస్థితుల పరిశీలనకు కేంద్రం బృందం పర్యటన ఖరారైనట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ (డీఏఎఫ్‌డబ్ల్యూ) జాయింట్ సెక్రటరీ పంకజ్‌యాదవ్ నేతృత్వంలో 10 మంది అధికారులతో కూడిన బృందం ఈనెల 11న జిల్లాకు చేరుకునే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. 12న అనంతపురంలో సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులు తెలుసుకోనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఆ తర్వాత వారంతా మూడు బృందాలుగా విడిపోతారు. ఒక బృందం సభ్యులు 13, 14వ తేదీల్లో శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధిలో 49 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతపురం జిల్లాలో 28, శ్రీసత్యసాయి జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. అధికారులు అంచనా వేసి రూ.251.20 కోట్ల మేర పంటనష్టం జరిగినట్లు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) కోసం ఇటీవల ప్రభుత్వానికి నివేదిక పంపారు.

కొండాపురంలో వీరగల్లు శాసనం



గోరంట్ల: మండలంలోని కొండాపురం గ్రామ వ్యవసాయ పొలాల్లో అతి పెద్ద వీరగల్లు శాసనాన్ని గుర్తించినట్లు చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి తూర్పున పొలాల్లో పూర్తిగా పాడుబడిన వైష్ణవాలయాన్ని పరిశీలిస్తుండగా వీరగల్లు శాసనం బయట పడిందన్నారు. విజయనగర రాజులు నిర్మించిన ఆలయ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులంతా కమిటీగా ఏర్పడితే ఇది సాధ్యమవుతుందని సూచించారు.

అభివృద్ధికి అడుగులు

ధర్మవరం ప్రజల చిరకాల స్వప్నం త్వరలోనే సాకారం కానుంది. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంతో పాటు సువిశాలమైన నాలుగు వరుసల రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇటీవలే ఎమ్మెల్యే కేతిరెడ్డి ఫోర్‌లేన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.80 కోట్లతో ధర్మవరంలో ఫోర్‌లేన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి
- ఇటీవలే భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి
- నిర్వాసితులకు మెరుగైన పరిహారం
- నిర్మాణం పూర్తయితే మారనున్న ధర్మవరం రూపురేఖలు



ఆర్‌ఓబీ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి (ఫైల్)

ధర్మవరం శివానగర్ వద్ద ఆర్‌ఓబీ వివరాలిలా..	
ఆర్‌బీఓ పొడవు (ఫోర్ లేన్)	900 మీటర్లు
ఖర్చు చేయనున్న మొత్తం	రూ.80 కోట్లు
కేంద్రం విడుదల చేసిన నిధులు	రూ.50 కోట్లు
రాష్ట్రం విడుదల చేసిన నిధులు	రూ.30 కోట్లు



ఆర్‌ఓబీ నిర్మాణానికి స్థలం ఇచ్చిన వ్యక్తిని పూలమాలతో సత్కరించి ధన్యవాదాలు తెలుపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి (ఫైల్)

ధర్మవరం: అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పట్టణం. వాణిజ్య పరంగానూ రాష్ట్రంలోనే పేరు గాంచిన ప్రాంతం. అందుకే ధర్మవరం పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి భారీగా జనం వస్తుంటారు. మరోవైపు జనాభా కూడా పెరుగుతుండగా... పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. దీంతో పాటే ట్రాఫిక్ సమస్యా పెరిగింది. ముఖ్యంగా శివానగర్ వద్ద ఉన్న కదిరి రైల్వేగేట్ (ఎల్‌సీ నంబర్–2) వద్ద రైలు గేటు పడినప్పుడు అనంతపురం–ధర్మవరం ప్రధాన రహదారిలో వాహనాలు బారులు తీరుతాయి. ఈ సమయంలో అత్యవసరంగా అటు వైపు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చర్యలు చేపట్టారు.

భూసేకరణ చట్టం మేరకు పరిహారం..
ఆర్‌ఓబీ నిర్మాణానికి 132 మంది ఇళ్లు కోల్పోతున్నారు. వీరందరికి ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారాన్ని మంజూరు చేసింది. ఇప్పటికే 65 మందికి సంబంధించిన పరిహారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యింది. అలాగే నిర్వాసితులకు పట్టణానికి సమీపంలోని పోతుల నాగేపల్లి జగనన్న లేఅవుట్‌లో పట్టాలు అందించారు. ఇంకా 28 మందికి సంబంధించిన సొమ్ము త్వరలోనే జమ కానుంది. మరికొంత మంది తమకు పరిహారం చాలడం లేదని కోర్టుకు వెళ్లగా... ఎమ్మెల్యే కేతిరెడ్డి వారిని ఒప్పించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు.

పనులు నిలిపేందుకు ప్రతిపక్షాలు కుట్ర..
ఫోర్‌లేన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, దీంతో రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు తెలుపుతారని భావించిన ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులను రెచ్చగొట్టారు. తమకు పరిహారం చాలడం లేదంటూ వారితో కోర్టులో కేసులు వేయించారు. ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సైతం బాధితులను రెచ్చగొట్టి పనులు ఆపేలా విశ్వ ప్రయత్నం చేశారు. అయితే చాలా మంది అతని మాటలు వినకుండా ప్రభుత్వం అందించిన పరిహారం తీసుకున్నారు. మరికొందరు మాత్రం ప్రతిపక్షాల కుట్రలో పావులుగా మారి కోర్టును ఆశ్రయించారు. వారిని కూడా ఒప్పించేందుకు ఇటు ఎమ్మెల్యే కేతిరెడ్డి, అటు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి..
ఆర్‌ఓబీకి నిర్మాణానికి స్థలాన్ని, ఇంటిని ఇచ్చి సహకరించిన నిర్వాసితుల ఇళ్ల వద్దకు ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వెళ్లారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలకు తెలియజేస్తూ సహకరించాలని కోరారు. అలాగే వారికి కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తయితే ప్రజలకు మేలు జరుగుతుందని, ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రజల మేలు, పట్టణ అభివృద్ధి దృష్ట్యా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పరిహారం చెల్లించాకే తొలగింపులు

నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్ల పరిహారం విడుదల చేసింది. ఇందులో రూ.11.50 కోట్లు ఇప్పటికే నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశాం. పరిహారం తీసుకున్న వారికే ఇళ్లు తొలగించుకోవాలని సూచించాం. అంతే తప్ప పరిహారం అందని వారి ఇళ్ల జోలికి వెళ్లలేదు. బాధితులందరికీ భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తున్నాం. మిగతా వారికీ పరిహారం ఇచ్చాకే పనులు మొదలు పెడతాం.
– సంజీవయ్య, ఈఈ, ఆర్‌అండ్‌బీ




ధర్మవరంలోని కదిరి గేట్ వద్ద రైలు వచ్చినప్పుడు వాహనాల రద్దీ

రూ.80 కోట్లతో ఫోర్‌లేన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి..

'సేతుబంధన్' పథకం కింద ఇటీవలే కేంద్రం ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 9 ఆర్‌ఓబీలను మంజూరు చేసింది. అందులో భాగంగానే ధర్మవరంలోని కదిరిగేట్ (ఎల్‌సీనంబర్–2) వద్ద 900 మీటర్ల పొడవున రైల్వే ఓవర్ బ్రిడ్జిని (ఫోర్‌లేన్ రహదారి) నిర్మిస్తోంది. ఇందుకు గానూ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు నిధులు విడుదల చేసింది. ఇక ఆర్‌ఓబీ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆర్‌ఓబీ టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది.

ఆర్‌ఓబీ మ్యాప్ →



ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం



రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. గేటు దాటి అవతలివైపునకు వెళ్లాలంటే కనీసం 20 నిమిషాలకు పైగానే సమయం పడుతోంది. వాహనాలు భారీగా నిలబడుతుండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి ఆర్‌ఓబీ నిర్మిస్తుండటం ఆనందంగా ఉంది. ప్రతిపక్ష పార్టీలు దయ ఉంచి ఆర్‌ఓబీకి అడ్డుపడకుండా ఉంటే పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతుంది.
– శంకర్, చేనేత కార్మికుడు, కేశవనగర్, ధర్మవరం

గతంలో ఎన్నో ప్రమాదాలు



కదిరి గేట్ వద్ద రైల్వే గేట్ వేసినప్పుడు వాహనాలు నియంత్రణ తప్పి గతంలో చాలా ప్రమాదాలు జరిగాయి. చాలా మంది ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. పిల్లల్ని విద్యా సంస్థలకు పంపాలంటే గేట్ వేసినప్పుడు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. పరీక్షల సమయంలో అయితే పిల్లల్ని కనీసం గంట ముందే పంపే పరిస్థితి ఉంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
– బైముతక రమణ, శివానగర్, ధర్మవరం

అభివృద్ధికి సహకరించాలి



ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు పట్టణం అభివృద్ధి చెందుతుంది. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాం. అలాగే జగనన్న కాలనీలలో 1.50 సెంట్ల స్థలం ఇచ్చి గృహ నిర్మాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఇప్పటికే 65 మందికి పరిహారం అందించాం. మరో 28 మందికి త్వరలోనే అందిస్తాం. పరిహారం సరిపోలేదని కొంతమంది కోర్టుకు వెళ్లారు. వారినీ ఒప్పించే ప్రయత్నం చేస్తున్నాం. పరిహారం అందుకున్న వారి నిర్మాణాలు మాత్రమే తొలగించేలా చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే రేగాటిపల్లి రైల్వేగేట్ వద్ద మరో ఆర్‌ఓబీ నిర్మించేలా ప్రభుత్వానికి నివేదికలు పంపాం.
– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే, ధర్మవరం

నైపుణ్యతతోనే వృత్తిలో రాణింపు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు



జస్టిస్ మన్మథరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం: న్యాయవాద వృత్తిలో నైపుణ్యం ఉంటేనే ఉన్నతంగా రాణించగలరని హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి అనంతపురం జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. ఆయన శనివారం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి విచ్చేశారు. కోర్టు ఆవరణాన్ని పరిశీలించి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులు నిత్య విద్యార్థులుగా ఉంటూ అన్ని విషయాలపై అవగాహన పెంచుకుని రాణించాలన్నారు. న్యాయవాద వృత్తి ఎంతో కఠినమైందన్నారు. నైపుణ్యత, పట్టుదలతో ముందుకెళితేనే ఉన్నత స్థాయికి చేరుకోగలరన్నారు. న్యాయస్థానాలు ఎప్పుడూ కక్షిదారుల వైపే ఆలోచిస్తాయని, న్యాయవాదులు వేసే పిటిషన్లు సహేతుకంగా లేకపోతే పక్కకు తోసేస్తాయని అన్నారు. న్యాయస్థానాల్లో తీర్పులు సామాన్యులకు కూడా అర్థమయ్యేలా ఉండాలన్న ఉద్దేశంతో ఇటీవల రెండు తీర్పులను తెలుగులో వెల్లడించినట్లు తెలిపారు. అందరికీ అర్థమయ్యేలా అందుబాటులోకి తెచ్చిన ఆ తీర్పులను సైతం అధిక శాతం న్యాయవాదులు చదవకపోవడం బాధాకరమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైన మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు. అంతకు ముందు లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారుల సదుపాయం కోసం హిందూపురం కోర్టులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ఏజీపీలు ఆశ్వర్థరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏపీపీలు ఇందాద్, నగేష్, సుహాసిని, మునిసిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి హిదాయతుల్లా, సీనియర్ న్యాయవాదులు నాగభూషణరావు, రామచంద్రారెడ్డి, సిద్దూ, సుదర్శన్ పాల్గొన్నారు.



జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా పుట్టపర్తి కోర్టులో కేసులు విచారిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాకేష్

8,072 కేసుల పరిష్కారం

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 8,072 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 24 బెంచులు నిర్వహించారు. బాధిత ఫిర్యాదుదారులు రాజీకి సమ్మతించడంతో రాజీపడదగిన క్రిమినల్ కేసులు 909, సివిల్ కేసులు 993, ప్రిలిటిగేషన్ కేసులు (పంచాయతీ ట్యాక్సు కేసులు, మున్సిపల్ ట్యాక్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు) 6126 , మోటారు ప్రమాద పరిహార కేసులు 44 పరిష్కారం చూపారు. రూ.3,25,07,000 మేర కక్షిదారులకు పరిహారం అందించాలని ఆదేశించా. సివిల్ కేసుల్లో రూ.1,76,54,367కు పైగా, ప్రి లిటిగేషన్ కేసుల్లో రూ.3,40, 48,617లను కక్షిదారుల మధ్య రాజీ ప్రకారం అందజేశారు. లోక్ అదాలత్ నిర్వహణను జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. శ్రీనివాస్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, కార్యదర్శి దీన పర్యవేక్షించారు.

'చెకుముకి' వాయిదా

అనంతపురం కల్చరల్: మిచాంగ్ తుపాను కారణంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 12న జరగాల్సిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు వాయిదా పడ్డాయి. మళ్లీ ఈ నెల 21న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలసిన ఎస్పీ



న్యాయమూర్తి మన్మథరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పర్యటనలో భాగంగా హిందూపురానికి విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ మన్మథరావును ఎస్పీ మాధవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక పోలీస్ గెస్ట్ హౌస్ వద్ద న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి, ఘనంగా స్వాగతం పలికారు.

ఆర్టీసీ డ్రైవర్ల నిజాయితీ



సామగ్రిని అప్పగిస్తున్న డిపో మేనేజర్ ఇనాయతుల్లా, డ్రైవర్లు

పుట్టపర్తి టౌన్: ప్రయాణికుడు మరిచిపోయిన వస్తువులను తిరిగి క్షేమంగా అతని వద్దకు చేర్చి ఆర్టీసీ డ్రైవర్లు జీఆర్ బాబు, ఈవీఎస్ రెడ్డి తమ నిజాయితీ చాటుకున్నారు. వివరాలు... పుట్టపర్తి డిపో చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సాయంత్రం చెన్నై నుంచి పుట్టపర్తికి బయలుదేరి శనివారం ఉదయం పుట్టపర్తికి చేరుకుంది. ఆ సమయంలో హడావుడిగా ప్రయాణికులందరూ దిగి వెళ్లిపోయారు. ఈ క్రమంలో బస్సు లోపల డ్రైవర్లు జీఆర్ బాబు, ఈవీఎస్ రెడ్డి పరిశీలిస్తుండగా ఓ సీటులో ల్యాప్‌టాప్‌తో పాటు మనీపర్సు పడి ఉండడం గమనించి, వాటిని భద్రంగా డిపో సెక్యూరిటీ గార్డు పోస్టులో అందజేశారు. కాసేపటి తర్వాత డిపో మేనేజర్‌కు పుట్టపర్తికి చెందిన విజయ్‌కుమార్ ఫోన్ చేశారు. తాను చెన్నై నుంచి వస్తూ బస్సులో ల్యాప్‌టాప్, మనీపర్స్ మరిచిపోయానని వివరించారు. దీంతో ఆయనను డిపో వద్దకు పిలిపించుకున్న మేనేజర్ ఇనాయతుల్లా సమగ్ర వివరాలు రాబట్టుకుని ల్యాప్‌టాప్, మనీపర్సు అందజేశారు. విలువైన సామగ్రిని తిరిగి తనకు క్షేమంగా చేర్చిన డ్రైవర్లు బాబు, ఈవీఎస్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నిఘా నేత్రం.. ఇల్లు భద్రం

పెళ్లిళ్లు.. విహారయాత్రలు.. పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లేవారి సంఖ్య గణనీయంగా పెరిగిన ప్రస్తుత రోజుల్లో అదే స్థాయిలో చోరీల సంఖ్యా పెరిగింది. కష్టపడి సంపాదించుకున్న సొమ్ము కాస్త దొంగలపాలవడంతో బాధితులు మనోవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ తాళం వేసిన ఇళ్లను దొంగల బారి నుంచి కాపాడేందుకు నూతన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. దీనిపై అవగాహన పెంచుకుంటే దొంగతనాలను అరికట్టడంతో పాటు నేరం జరిగినప్పుడు సత్వర దోషులనూ సులువుగా పట్టుకునేందుకు వీలవుతుంది. ఈ వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోలీసులు కోరుతున్నారు.



- ప్రయోజనకరంగా మారిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్
- ఇళ్లపై నిఘా కెమెరాల ఏర్పాటుతో పర్యవేక్షణ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: నేరాల నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు సీసీ కెమెరాల ప్రాధాన్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థలో భాగంగా డివిజన్ పరిధిలోని సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే తాళం వేసిన ఇళ్లలో దొంగలు చొరబడకుండా ఉండేందుకు ఇళ్లపై సీసీ కెమెరాల ఏర్పాటుతో అహర్నిశం పర్యవేక్షణ చేసేలా నూతన వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) పేరుతో పిలిచే ఈ వ్యవస్థపై జిల్లా వాసులను చైతన్య పరిచే కార్యక్రమాలను పోలీసు శాఖ విస్తృతం చేసింది.

యాప్ రిజిస్ట్రేషన్‌తో సేవలు అందుబాటులోకి..

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా పోలీసు నిఘా నేత్రం సేవలను అందుకోవచ్చు. ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత అందులో పేరు, చిరునామా, సెల్‌నంబర్ తదితర వివరాలు నమోదు చేయడం ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమోదిస్తూ ఓ యూనిక్ ఐడీ నంబర్ జనరేట్ అవుతుంది. ఎప్పుడైనా ఇంటికి తాళం వేసి వెళుతుంటే యాప్‌లోని రిక్వెస్ట్ వాచ్‌లో మనం ఊరికెళుతున్న రోజు నుంచి తిరిగి వచ్చే తేదీని నమోదు చేస్తే పోలీసు అధికారులు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వెళతారు. ఊళ్లకు వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకూ ఆ ఇళ్లపై వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలు సమర్థవంతంగా నిఘా ఉంచుతాయి. దీనికి తోడు అప్పుడప్పుడు పోలీసులు అటుగా వచ్చి ఇంటి పరిసరాలు పరిశీలించి వెళుతుంటారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవల వినియోగంపై జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో రోజూ 15 నుంచి 20 మందితో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఇన్‌స్టాల్ చేయిస్తున్నారు.

పనిచేస్తుందిలా..

ఇంటికి పోలీసులు బిగించిన కెమెరా నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌తో పాటు ఇంటి యజమాని మొబైల్ ఫోనుకూ అనుసంధానమై ఉంటుంది. ఆ తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అలారం ఏర్పాటు చేయడమే కాక, స్టేషన్‌లోని మానిటర్ ద్వారా సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. ఎవరైనా ఇంటి తలుపు వద్దకు చేరుకోగానే పోలీసు స్టేషన్‌లోని అలారం మోగుతుంది. వెంటనే సీసీ ఫుటేజీల ద్వారా ఆ ఇంటి వద్దకు ఎవరు వచ్చారు. ఎంతమంది వచ్చారనే అంశాలను పోలీసులు పరిశీలిస్తూ ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని ఆగంతకులను అదుపులోకి తీసుకుంటారు.

ఉచితంగానే సేవలు



ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. ఈ సేవలను పూర్తి ఉచితంగా పొందవచ్చు. దొంగతనాలు జరిగిన తర్వాత ఇబ్బంది పడడం కంటే ముందుగా అప్రమత్తతో వ్యవహరిస్తూ ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి. తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలను పూర్తి స్థాయిలో నిరోధించాలంటే ప్రజలు తప్పనిసరిగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి. – మాధవరెడ్డి, ఎస్పీ


సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఆల్ ది బెస్టు అకాడమీ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా సంక్రాంతి జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానానికి రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సంస్థ నిర్వాహకులు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారితో పాటూ ప్రత్యేకంగా జర్నలిజం రంగంలో రాణిస్తున్న విలేకర్లు, ఫొటోగ్రాఫర్లకు సంక్రాంతి విశిష్ట ప్రతిభా అవార్డులను జనవరి 7న హైదరాబాదు వేదికగా అందించనున్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలతో ఈ నెల 25వ తేదీ లోపు 'ఆల్ ది బెస్టు అకాడమీ, డోర్.నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాదు-15' చిరునామాకు దరఖాస్తులు పంపాలి.

మహిళ బలవన్మరణం

గుంతకల్లు రూరల్: అనారోగ్య కారణాలతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.... గుంతకల్లు మండలం నక్కనదొడ్డి తండాకు చెందిన సోమ్లానాయక్, లక్ష్మమ్మ దంపతులకు కుమార్తె సరోజమ్మ (42), ఓ కుమారుడు ఉన్నారు. సరోజమ్మకు చిన్నప్పటి నుంచి కళ్లు కనిపించవు. కొన్నేళ్ల క్రితమే అనారోగ్యంతో సోమ్లానాయక్ మృతి చెందాడు. అప్పటి నుంచి లక్ష్మమ్మ ఒక్కతే కుటుంబాన్ని పోషిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే సరోజమ్మకు అనారోగ్య సమస్యలు వెన్నాడుతూ వచ్చాయి. దీంతో మనస్తాపం చెందిన ఆమె శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వినోద్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన వినోద్ (28) గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం తన స్నేహితులు వినయ్, రవితో కలసి ద్విచక్ర వాహనంపై కసాపురానికి బయలుదేరిన వినోద్... గుంతకల్లు మండలం నక్కనదొడ్డి వద్దకు చేరుకోగానే వాహన వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వినోద్ అక్కడికక్కడే మృతిచెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న రవిని వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. స్వల్ప గాయాలతో వినయ్ బయటపడ్డాడు. ఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం: సెల్‌ఫోన్ కోసం అన్నదమ్ముల మధ్య చెలరేగిన ఘర్షణలో చివరకు తమ్ముడిని హతమార్చిన అన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాయలయంలో సీఐ నాగరాజు, శెట్టూరు ఎస్ఐ రాంభూపాలతో కలసి డీఎస్పీ శ్రీనివాసులు శనివారం వెల్లడించారు.

శెట్టూరు మండలం కనుకూరుకు చెందిన గొల్ల రవి, కృష్ణమూర్తి అన్నదమ్ములు. ఈ నెల 7న రవి కళ్యాణదుర్గం వస్తూ తన వెంట తమ్ముడి సెల్‌ఫోన్ పట్టుకొచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న కృష్ణమూర్తి వెంటనే కళ్యాణదుర్గంలోని వాల్మీకి సర్కిల్ వద్దకు చేరుకుని తన రవిని నిలదీశాడు. తనకు తెలియకుండా సెల్‌ఫోన్ ఎందుకు తెచ్చావంటూ రాయితో నుదిటిపై కొట్టాడు. అందరూ చూస్తుండగా తనకు జరిగిన అవమానాన్ని అన్న జీర్ణించుకోలేకపోయాడు. అదే రోజు రాత్రి భోజనం చేసి నిద్రిస్తున్న తమ్ముడిపై అర్ధరాత్రి దాటిన తర్వాత గొడ్డలితో దాడి చేసి, హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. హతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 8న సాయంత్రం 5.30 గంటలకు శెట్టూరు మండలం అయ్యగార్లపల్లి బస్టాఫ్ వద్ద రవిని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గ్రామీణులకు వైద్యం అందించడమే లక్ష్యం





ప్రసంగిస్తున్న డాక్టర్ నరసింహన్, పాల్గొన్న మొబైల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

- సత్యసాయి మొబైల్ వైద్య సేవల డైరెక్టర్ డాక్టర్ నరసింహన్

ప్రశాంతి నిలయం: గ్రామ స్థాయిలోనే ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా సత్యసాయి మొబైల్ ఆస్పత్రి పనిచేస్తోందని సత్యసాయి మొబైల్ వైద్య సేవల డైరెక్టర్ డాక్టర్ నరసింహన్ పేర్కొన్నారు. సత్యసాయి మొబైల్ ఆస్పత్రి 18వ వార్షికోత్సవాన్ని సాయికుల్వంత్ మందిరంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలో మొబైల్ వైద్య సేవల్లో పాల్గొనే 500 మంది వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది, ఫార్మసిస్టులు, మొబైల్ వైద్య సేవల సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు. మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొబైల్ ఆస్పత్రి ద్వారా అందిస్తున్న సేవలను డాక్టర్ నరసింహన్ వివరించారు. రాబోవు రోజుల్లో సేవలను మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సత్యసాయి సేవలను కీర్తిస్తూ మొబైల్ వైద్య సేవల సిబ్బంది భక్తి గీతాలు ఆలపించారు.

అయ్యప్ప భక్తుడి దుర్మరణం

గుమ్మఘట్ట: కర్ణాటకలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గుమ్మఘట్ట మండలం కలుగోడుకు చెందిన అయ్యప్ప భక్తుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... కలుగోడుకు చెందిన కె. వెంకటేశులు (53) ఇటీవల అయ్యప్ప దీక్ష చేపట్టాడు. ఈ క్రమంలో ఈ నెల 4న గోనబావిలోని అయ్యప్ప గుడి వద్ద ఇరుముడి కట్టుకుని మరో 20 మంది దీక్షాపరులతో కలసి కాలినడకన శబరిమలకు బయలుదేరి వెళ్లాడు. శనివారం కర్ణాటకలోని గౌరిబిదనూరు వద్ద రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళుతున్న అయ్యప్ప భక్తులను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో వెంకటేశులు అక్కడికక్కడే మృతి చెందాడు. గోనబావికి చెందిన మణికంఠ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడికి ఇద్దరు కుమార్తెలున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం: జీవితంపై విరక్తితో ఓ గుర్తు తెలియని వ్యక్తి (50) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని పట్టాలపై శనివారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. తెల్లటి ఫుల్ షర్టు, పంచ ధరించి ఉన్నాడు. వ్యక్తి అదృశ్యం కేసుల్లోని సంబంధీకులు ఎవరైనా 94412 38182లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

పుట్టపర్తి: కొత్తచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా శాఖ నూతన గౌరవాధ్యక్షుడిగా పీపీ మాధవ్, అధ్యక్షుడిగా కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా చంద్ర, ఆడిట్ కన్వీనర్‌గా నాగభూషణతో పాటు కో కన్వీనర్లుగా నలుగురిని, కార్యవర్గ సభ్యులుగా ఆరుగురు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న నృత్య నీరాజనం

నృత్యనీరాజనంలో పాల్గొన్న కళాకారులు



అనంతపురం కల్చరల్: రంగస్థల సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అనంతపురంలోని లలిత కళాపరిషత్తులో జరిగిన నృత్యనీరాజనం అందరినీ ఆకట్టుకుంది. 108 మంది కళాకారులు పార్వతీదేవి రూపాలతో రూపొందించిన నృత్యరూపకాన్ని మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శరత్‌చంద్ర ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నేటి తరానికి పురాణేతిహాసాల ఇతివృత్తాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో లలితకళాపరిషత్ పాలక మండలి సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

పదిలంగానే పాతాళగంగ

- గత నాలుగున్నరేళ్లలో తొలిసారిగా 10 మీటర్లు దాటిన సూచీ
- నాలుగేళ్లుగా 5 నుంచి 9 మీటర్ల మధ్య భూగర్భజలాలు
- 2014–18 మధ్య కాలంలో 20 నుంచి 25 మీటర్లుగా నమోదు



రాప్తాడు మండలంలో బోరుబావి నుంచి నీళ్లు

అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మొదటి సారిగా భూగర్భజలాలు స్వల్పంగా తగ్గదల నమోదయ్యాయి. నైరుతి, ఈశాన్య రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపకపోవడం, ఇటీవల కొన్ని జిల్లాలను తీవ్రంగా వణికించిన 'మిచాంగ్' తుఫాను కూడా ప్రభావం చూపని కారణంగా భూగర్భజలమట్టం కాస్తంత తగ్గింది. అయినా పాతాళగంగ పదిలంగానే ఉన్నట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 97 పీజోమీటర్ల నుంచి భూగర్భజలశాఖ ఇటీవల సేకరించిన సమాచారం ప్రకారం ప్రస్తుతం జిల్లా సగటు నీటి మట్టం 10.14 మీటర్లుగా నమోదైంది. గత నాలుగున్నరేళ్లుగా కేవలం 5 మీటర్ల నుంచి 9 మీటర్ల మధ్య గణనీయంగా పెరిగిన భూగర్భజలాలు... తొలిసారిగా 10 మీటర్ల సూచీని తాకింది. 2014–18 మధ్య చంద్రబాబు హయాంలో భూగర్భజలాలు ఏకంగా 20 నుంచి 25 మీటర్ల మధ్య అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. అప్పటితో పోల్చుకుంటే పరిస్థితి చాలా మెరుగ్గానే ఉండటం గమనార్హం.

10.14 మీటర్లుగా నమోదు

ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు 500 మి.మీ వర్షం పడాల్సిఉండగా 36 శాతం తక్కువగా 288 మి.మీ నమోదు కావడంతో భూగర్భజలమట్టం ప్రస్తుతం 10.14 మీటర్లుగా సగటు నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో స్థిరంగానే ఉండగా కొన్ని మండలాల్లో తగ్గుముఖం పట్టాయి. బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, గుత్తి, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, కంబదూరు, కణేకల్లు, పామిడి, పుట్లూరు, రాయదుర్గం, శెట్టూరు, తాడిపత్రి, యాడికి తదితర 15 మండలాల్లో కొంత వరకు తగ్గాయి.

● ఈ ఏడాది వర్షాల రూపంలో 103 టీఎంసీలు ప్రవహించగా అందులో 13 టీఎంసీల వరకు భూగర్భంలో ఇంకిపోయినట్లు భూగర్భజలశాఖ డీడీ కె.తిప్పేస్వామి తెలిపారు. ప్రస్తుతం ఒక మండలంలో మూడు మీటర్ల లోపు కనిపిస్తుండగా 3 నుంచి 8 మీటర్ల మధ్య 13 మండలాల్లో ఉన్నాయన్నారు. 8 నుంచి 15 మీటర్ల మధ్య 12 మండలాలు ఉండగా... కేవలం 5 మండలాల్లో 15 మీటర్లకు పైగా భూగర్భజలమట్టం నమోదైందని తెలిపారు.

వైభవంగా అంజన్న పూల రథోత్సవం



ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి పూల రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, విశేష పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, వెండి తమలపాకుల అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 7.30 గంటలకు రథోత్సవాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు, సర్పంచ్ పరమేశ్వర, వైస్ ఎంపీపీ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖరరెడ్డి, లోకేష్, ఆనందరెడ్డి, మనోహర్‌శెట్టి, రామకృష్ణ, వీరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న విప్ కాపు